జ్యోతిర్మయ శర్మ

# హిందుత్వ

**హిందూ జాతివాద భావనపై పరామర్శ**

తెలుగు సేత : అనంతు

**ఎమెస్కో**

# విషయసూచిక


| | |
|---|---|
| ఎందుకంటే | 5 |
| సంపాదకీయం | 6 |
| 'హిందుత్వ' తెలుగు అనువాదానికి నామాట | 9 |
| 1. పరిచయం | 11 |
| 2. దయానంద సరస్వతి | 23 |
| 3. శ్రీ అరవిందుడు | 53 |
| 4. స్వామి వివేకానంద | 77 |
| 5. వినాయక దామోదర్ సావర్కర్ | 127 |
| పాదపీఠికలు | 173 |
| కృతజ్ఞతలు | 197 |
| అనువాదాల విషయంలో ఒక వివరణ | 200 |

# 1

# పరిచయం

హిందుత్వభావన సమకాలీన భారతసమాజంపై బలమైన, మేధాపరమైన, రాజకీయ సవాళ్ళను విసురుతుంది. ఈ భావనను సమర్థించేవాళ్ళు దీనిని సాంస్కృతిక జాతీయవాదనకు ఒక రూపంగా అర్థం చేసుకుంటున్నారు. హిందుత్వ అన్నమాటకు కచ్చితమైన అర్థం విషయంలో హిందుత్వ అనుయాయుల్లో కూడా ఏకాభిప్రాయం అత్యల్పం. హిందుత్వకు హిందూ మతానికీ అసలు భేదమేమీలేదనీ హిందూ మత సారానికి హిందుత్వ ప్రతినిధి అనీ కొందరు వాదిస్తారు. హిందూమతానికీ, హిందుత్వకీ భేదం లేదనే అభిప్రాయానికి దూరంగా ఉండాలనుకొనేవాళ్లు కూడా కొందరున్నారు. హిందుత్వ అంటే నిజంగా భారతీయత అనీ, ఎలా నిర్వచించినా ఒక సైద్ధాంతిక ఏకత్వంతో ఈ భారతీయతకు ఒక అస్తిత్వాన్ని, సంస్కృతిని అందించే మూలపదార్థం హిందూ అంశమేననీ వీళ్లు సూచిస్తారు. హిందూ ప్రమాణాలతో 'భారతీయ అస్మిత'ను నొక్కివక్కాణించడమే హిందుత్వ అని పలువురు భావిస్తున్నారు.

జాతి వర్ణ మత అసహిష్ణుతమీద ఆధారపడిన ఒకవిధమైన విధ్వంసక జాతీయవాదానికి ప్రోత్సాహమిచ్చే కొన్ని భావాలతో హిందూమతాన్ని జోడించడం హిందుత్వ వ్యతిరేకవాదులకు అంగీకారం కాదు. హిందువులకు గతంలోనూ, వర్తమానంలోనూ జరిగాయని, జరుగుతున్నాయని నిజమైన, ఊహించుకుంటున్న అన్యాయాలను భూతద్దంలో చూపించడం వెనుక ఉన్న హిందుత్వ భావనయే హిందూమత బహుళత్వ లక్షణానికి నిజమైన ప్రమాదంగా పరిణమిస్తుందని వీళ్లు అభిప్రాయపడుతున్నారు. మతపరమైన హింస, మైనారిటీలకు అసమ్మతివాదులకు వ్యతిరేకంగా జరుగుతున్న దుష్ప్రచారం, రాజకీయ ప్రత్యర్థులకు బెదిరింపులు – ఇవన్నీ, ప్రజాస్వామిక వ్యవస్థల పట్లా, పౌరసమాజం పట్లా, రాజకీయం పట్లా హిందుత్వకున్న నిర్లక్ష్యాన్ని తెలియచేస్తున్నాయని వీళ్ళు చెబుతున్నారు. హిందుత్వ వాదులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజాస్వామిక

వ్యవస్థల్ని ఉపయోగించుకొంటున్నారని మరికొందరు ఆరోపిస్తున్నారు. అత్యధిక సంఖ్యాకుల ఆదర్శసమాజం కోసం హిందుత్వ అన్వేషిస్తుందని వీళ్ళు అంటున్నారు. అయోధ్యలో ఆలయాన్ని నిర్మించాలనే ఇటీవలి డిమాండు కూడా, రాజ్యం యొక్క అంగాలను తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవడంలో భాగమే.

హిందుత్వను ప్రతిఘటించే నిర్దిష్ట పద్ధతుల్ని పరిశీలించడం ఈ పుస్తకం స్థూల ఉద్దేశ్యం. నిజానికి, హిందుత్వ భావనకు వస్తున్న ప్రతిస్పందనల్ని, స్థూలంగా మూడు రకాలుగా విభజింపవచ్చు. మొదటిది: హిందుత్వకు సంబంధించిన విలువలు, ఆచరణలు, భాష చాలా తీవ్రంగా ఉంటాయి కాబట్టి దాని అనుచరులతో ఏ విధమైన చర్చకూ ఆస్కారం లేదన్నది. విలువలలో అనివార్యమైన భిన్నత్వం ఉండడం వల్ల ఏ రకమైన అవగాహనను సాధించడానికి తావులేకుండా పోతూ ఉంది. ఇరు వర్గాలు చేయగలిగింది ఒక్కటే, చిత్తడిలో పక్క పక్కన కూర్చోవడం.[1] కూర్చొని ఏం చేస్తారు? ఎవరి ఎజెండాలను వాళ్ళు అమలు పరుస్తారు. ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తితే రాజ్యం జోక్యం చేసుకొని పరిష్కరిస్తుందని ఆశపడతారు.

రెండవ వాదం ఏమి చెబుతుంది అంటే, హిందుత్వను నేరుగా ఎదుర్కోవాలి. ఈ ఘర్షణ లక్షణాలు రాజకీయాలలోనే ప్రతిబింబించాలనేం లేదు. ఏ పునాది మీద హిందూమతం ఆధునికతను ఎదుర్కొంటుందో, బహుళ సాంస్కృతిక, బహుళ జాతుల, బహుళత్వ భారత దేశంలో తన న్యాయమైన స్థానాన్ని నిర్ణాయకంగా కాపాడుకుంటుందో, ఆ పునాదిని మార్చేవైపుగా పునరాలోచింప చేయడం ద్వారా ఒక ప్రత్యామ్నాయ అధిభౌతిక తత్త్వాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.[2] మరో రకంగా చెప్పాలంటే, హిందూమతాన్ని పునర్ మూల్యాంకనం చేస్తూ, ఆ మతం పట్ల సానుభూతితో ఉంటూనే, విమర్శనాత్మకంగా ఉండటం ద్వారా హిందుత్వను సవాలు చేయాలి.

ఈ సవాలును స్వీకరించకపోవడం అంటే హిందూమత ఉదార స్వభావం స్థానాన్ని హిందుత్వను మిలిటెంటు స్వభావంగా మార్చేవారికి అప్పగించడమే అవుతుంది.

చివరగా హిందుత్వ వ్యతిరేకులు హిందుత్వ వాదులతో సంభాషణలు జరపాల్సిన అవసరం ఉందని మనం వాదించవచ్చు. ఈ చర్చ తప్పనిసరిగా మూడు స్థాయిల్లో జరగాలి. హిందువులు తమలో తాము అంతర్గత చర్చలు ప్రారంభించాలి. వివాదాస్పద సైద్ధాంతిక అంశాల్ని పరిష్కరించుకోవాలి. రెండు: భారతదేశంలో నివసించే హిందూయేతర అన్ని మతాలవాళ్ళు తమలో తాము

అర్థవంతంగా చర్చించేందుకు సిద్ధమవ్వాలి. మూడు : హిందువులు, ఇతర మతస్థులు కూడా హిందుత్వ సిద్ధాంతకర్తలు, అవలంబకులతో చర్చలకు స్వచ్ఛందంగా ముందుకురావాలి. చర్చలను ప్రోత్సహించాలి. ఈ సూచన పెద్ద రాజకీయ అమాయకత్వంగానూ, అనాచరణీయంగానూ తోచవచ్చు. కానీ, మనం కాని 'ఇతర' శక్తులతో సంభాషణ జరపకుండా, హిందుత్వను విజయవంతంగా ప్రతిఘటించడం సాధ్యం కాదు.

ఈ చర్చల ఉద్దేశం హిందుత్వను సవాలు చేసే బాధ్యతను రాజకీయ నాయకులు, మతానికి ప్రతినిధులమని చెప్పుకొనేవాళ్లు, తేలిగ్గా తీసుకొనే వాళ్లనుండి హస్తగతం చేసుకోవడం. ఇది ఎర వేయడంలా తోచవచ్చు. కాని భారతీయతను బహుకాలం నిల్పగలిగే మానవీయతా భావాన్ని నెలకొల్పే ప్రయత్నం. అర్థవంతమైన చర్చలకు అహేతుకత, అస్థాన పతితమైన ఆశావాదం, తమ వాదమే సరయిందన్న పిడివాదం అడ్డంకులు. తక్షణమే పరిష్కారం లభించాలన్న ఆశాభావం కూడా ఒక అడ్డంకే. ఇది అన్ని పక్షాలనూ 'సన్నిహితం గానూ, సన్నిహితదూరంగాను తీసుకొనివచ్చే అవకాశం కూడా ఉంది.'[3] అంతేకాదు పదే పదే జరిగే హింస మూలంగా ఈ చర్చ కుంటుపడుతుంది. అంతేకాదు, మేధావులు, కళాకారులు, శాస్త్రవేత్తలు అతివాద హిందుత్వ విభాగంతో కుమ్మక్కవడం వల్ల కూడా ఈ ప్రక్రియకు విఘాతం కలుగుతోంది.

చర్చల ద్వారా హిందుత్వను ప్రతిఘటించటానికి వెయ్యాల్సిన మొదటి అడుగు ఏమిటంటే, అటువంటి చర్చల మార్గపు సాధ్యతల పట్ల మరింత ఆశావహంగా ఉండటం. దీన్ని సాధించేందుకు తర్వాతి అడుగు, మన స్వంత సంప్రదాయాల పట్ల సంశయాత్మకంగా ఉండాలి. తమకు తామే ప్రతినిధులుగా ప్రకటించుకొనే వాళ్ళను, సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక అవకాశాల్ని పొందుతున్న వ్యక్తుల, చిహ్నాల, శాస్త్రాల అధికారాన్ని, గళాన్ని ప్రశ్నించాలి. నిజానికి ఇదే ఈ పుస్తకం ప్రధాన ఇతివృత్తం. పందొమ్మిదవ, ఇరవయ్యవ శతాబ్దాలలో హిందూ మతం యొక్క, హిందూ గుర్తింపు యొక్క స్పష్టమైన పునఃప్రకటనల్ని ఈ పుస్తకం పరిశీలిస్తుంది. రెండు ప్రధాన ప్రశ్నలకు నాలుగు ప్రబలమైన సమాధానాల్ని అర్థం చేసుకొనే ప్రయత్నమే ఈ పుస్తకం. అవి: హిందువు ఎవరు? హిందూమతం అంటే ఏమిటి? మహర్షి దయానంద సరస్వతి, స్వామి వివేకానంద, శ్రీ అరవిందుడు, వి.డి. సావర్కర్ ఈ ప్రశ్నలకు సమాధానాల్ని అందించారు. అవి ఇప్పటికీ తమ ప్రాధాన్యతను కలిగే ఉన్నాయి. నిర్దిష్ట హిందుత్వ గుర్తింపు కోసం జరిపే అన్వేషణ యొక్క తీవ్ర వ్యక్తీకరణగా, అత్యంత పరిణతి చెందినదిగా సావర్కర్ భావనను అర్థం చేసుకోవచ్చు.